మంచాలలో నర్సరీల్లోని మొక్కలను పరిశీలిస్తున్న పీడీ శ్రీలత

నర్సరీలపై నిర్లక్ష్యం తగదు

రంగారెడ్డి జిల్లా పీడీ శ్రీలత

మంచాల, ఫిబ్రవరి 22 : నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పుడికప్పుడూ పర్యవేక్షించాలని రంగారెడ్డి జిల్లా పీడీ శ్రీలత అన్నారు. గురువారం మంచాలలో ఉన్న వన నర్సరీని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీల్లో ఎక్కువగా వేప, మల్బరీ, తులసి, కరివేపాకు మొక్కలను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా నీళ్లను అందించాలని చెప్పారు. అనంతరం పల్లెప్రకృతి వనాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్, ఈవోఆర్డీ తేజ్‌సింగ్, ఏపీవో వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఈసీ విమల, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి పాల్గొన్నారు.

విదేశీ విద్యానిధికి అర్హులైన మైనార్టీ విద్యార్థులు

దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి

వికారాబాద్, ఫిబ్రవరి 22 : తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ఎంతో ఉపయోగపడుతుందని వికారాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద స్కాలర్‌షిప్/ఆర్థిక సహాయం కోసం పేద మైనార్టీ విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో చదువుటకు ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయుటకు అవకాశం ఉందన్నారు. అదే విధంగా పీ.జీ.లో 60 శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ చదువుటకు 1 ఆగస్టు 2023 నుంచి 31 డిసెంబర్ 2023 వరకు విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ తీసుకున్న మైనార్టీస్ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కింద స్కాలర్‌షిప్/ఆర్థిక సహాయం మంజూరు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారుడి కుటుంబ సంవత్సర ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలి. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా దేశాల్లోని యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. మిగతా అర్హత వివరాలు వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మార్చి 23న సాయంత్రం 5 గంటల లోపు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సహా మూడు జతల జిరాక్స్ ప్రతులతో మార్చి 30న సాయంత్రం 5 గంటల లోపు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, వికారాబాద్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనం/ఆర్థిక సహాయం రెండు విడుతల్లో, 60 వేల రూపాయల వరకు విమాన చార్జీలు చెల్లింపబడతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 94406 85713ను సంప్రదించాలని ఆమె సూచించారు.

అడవులు, జంతుజాలాన్ని రక్షించుకుందాం

వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్, ఫిబ్రవరి 22 : మన అడవులను, జంతుజాలాన్ని రక్షించుకుందాం, భవిష్యత్ తరాలకై వృక్ష, జంతు సంపదను అందజేద్దామని వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్న వేళ అడవుల్లో అగ్గి రాజుకోవడం సాధారణంగా జరుగుతుందని.. దానిని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా వికారాబాద్ అడవుల్లో గడ్డి భూములు ఫారెస్ట్ ఫైర్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఇలా తొందరగా తగులబడే అవకాశం ఉన్న గడ్డి అనంతగిరి, దామగుండం, తిప్పాపూర్, మోత్కుపల్లి అడవుల్లో కనిపిస్తుందన్నారు. ఫారెస్ట్ ఫైర్ వల్ల నేలపై నివసించే సరీసృపాలు, కీటకాలు, చిన్న కుందేళ్లు మొదలైనవి తీవ్రంగా ప్రభావితం అవుతాయి. శాకాహారులు గడ్డి లభ్యత తగ్గి ఇబ్బందిపడతాయి. చిన్న సైజులో గల మొక్కలు చనిపోతాయి. ప్రపంచ గణాంకాల ప్రకారం 95 శాతం వరకు మానవ తప్పిదాల వల్లనే అడవుల్లో అగ్గి రాజుకుంటున్నది. మిగిలిన 5 శాతం మాత్రమే సహజ కారణాల వల్ల అడవులు తగులబడుతున్నాయి. బీడీ, సిగరెట్‌లు తాగి అలానే పడవేయడం, అటవీ ప్రాంతాల్లో వంటలు చేసుకోవడం లాంటి కారణాలు మానవ తప్పిదాలుగా మారుతున్నాయని తెలిపారు. అడవి అగ్గికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవుల్లో ఈ మధ్య ఏర్పడుతున్న అగ్నిప్రమాదాలను ఫారెస్ట్ సిబ్బంది ఫైర్ బ్లోయర్స్ ద్వారా సమర్థవంతంగా మిగతా ప్రాంతాలకు విస్తరించకుండా ఆర్పుతున్నారన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా ఫైర్ అలర్ట్స్ ఫారెస్ట్ సిబ్బంది టీవీ, మొబైల్ ఫోన్‌లకు వెంటనే సమాచారం చేరుతుందన్నారు. తద్వారా ఎక్కడ అగ్గి రాజుకుంటుందో అక్కడికి వెంటనే సిబ్బంది చేరి మంటలను ఆర్పుటకు చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

మీర్‌పేట్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్లు

కలెక్టర్ శశాంకకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న కార్పొరేటర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 : రంగారెడ్డిజిల్లాలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లపై కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మెజార్టీ కార్పొరేటర్లు సంతకాలు చేసి గురువారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. అవిశ్వాస తీర్మానంపై సంతకాలు పెట్టినవారిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందినవారున్నారు. ప్రస్తుతం మీర్‌పేట్ మేయర్‌గా దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్‌గా తీగల విక్రమ్‌రెడ్డి బీఆర్ఎస్‌పార్టీ నుంచి కొనసాగుతున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన కార్పొరేటర్లంతా క్యాంపునకు వెళ్లిపోయారు. ప్రస్తుతం మీర్‌పేట్ కార్పొరేషన్‌లో 46 మంది కార్పొరేటర్లున్నారు. గత ఎన్నికల్లో కార్పొరేటర్లుగా బీఆర్ఎస్ నుంచి 24, కాంగ్రెస్ నుంచి 5, బీజేపీ నుంచి 16 మంది గెలుపొందారు. మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినవారిలో కాంగ్రెస్ నుంచి 7, బీజేపీ నుంచి 14, మిగిలినవారు బీఆర్ఎస్ అసమ్మతి కార్పొరేటర్లున్నారు. తీర్మానంపై సంతకాలు చేసిన కార్పొరేటర్ల సంతకాలను నిర్ధారించుకోవడానికి కమిషనర్‌కు పంపుతామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న అవిశ్వాసాల పరంపర

ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలో అవిశ్వాసాల పరంపర కొనసాగుతున్నది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసాల తీర్మానాలు పూర్తయ్యాయి. మణికొండ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా గురువారం బలపరీక్ష నిర్వహించారు. ఉప్పరిగూడ, బాటసింగారం సహకార సంఘాల చైర్మన్లపై కూడా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టగా.. గురువారం బలపరీక్ష నిర్వహించారు. చైర్మన్ కోర్టును ఆశ్రయించగా.. బలపరీక్ష వివరాలను అధికారులు గోప్యంగా ఉంచి సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందజేశారు. ఈ నెల 28న బాటసింగారం సహకార సంఘం చైర్మన్‌పై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టి బలపరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాలోని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్‌పై కూడా జడ్పీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.



కులకచర్ల మండల పరిధిలోని అడవులు, పొలాల వద్ద మోదుగ పూలు ప్రకృతిని మైమరిపించేలా కనువిందు చేస్తున్నాయి. మోదుగ పూలు పూశాయంటే హోలీ పండుగ దగ్గరలో ఉందని తెలియజేస్తాయి. వేసవి సమీపిస్తుండటంతో చెట్ల ఆకులు రాలిపోతుండగా కొత్త చిగురులు వస్తున్న వేళ మెదుగ చెట్లకు ఆకులు లేకుండా చెట్లు మొత్తం మొదుగ పువ్వులతో దర్శనమిస్తున్నాయి. - కులకచర్ల, ఫిబ్రవరి 22


చేవేళ్లరూరల్ : ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- ఎంపీ రంజిత్‌రెడ్డి
- న్యాలటలో ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజ

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 22 : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని న్యాలట గ్రామంలో శివస్వాముల ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, అందరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే

చేవెళ్లటౌన్ : ఊరేళ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రాంచందర్ కుమారుడి వివాహం గురువారం చేవెళ్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వేడుకలకు ఎంపీ, చేవెళ్ల, బీఆర్ఎస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న స్పీకర్

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 22 : దుద్యాల మండలం పోలేపల్లి గ్రామంలోని ఎల్లమ్మ తల్లిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. స్పీకర్‌కు ఆలయ మేనేజర్ రాజేందర్ రెడ్డి, అర్చకులు, కమిటీ సభ్యులు, మాజీ చైర్మన్ వెంకటేశ్, గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో అమ్మవారికి స్పీకర్ ప్రత్యేక పూజలు చేశారు. మేనేజర్ స్పీకర్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వచ్చే వారం జరిగే జాతర నిర్వహణ గురించి స్పీకర్ మేనేజర్, కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మేనేజర్, కమిటీ సభ్యులు కోరగా.. ఏమేం అభివృద్ధి పనులు కావాలో జాతర ముగిసిన తరువాత తనకు లిఖితపూర్వకంగా ఇస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

కడ్తాల్, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. దేవతామూర్తులకు శుద్ధ జలం, పంచామృతాలతో అభిషేకం చేసి, గ్రామ ప్రధాన పురోహితుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సుధాకర్‌గౌడ్ పట్టు వస్త్రాలు సమర్పించగా, కృష్ణమూర్తి పుస్తె, మెట్టెలను అందజేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తోపాటు ప్రజాప్రతినిధులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా పోతుగంటి మహేశ్ ఆలయానికి ఆవు దూడను దానం చేయగా, వేలం పాటలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.16వేలు వెచ్చించి దూడను తీసుకున్నారు.

కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహా

ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న నాయకులు, భక్తులు

రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు చెన్నకిషన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లప్ప, సాయిరెడ్డి, యాదయ్యగౌడ్, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, శ్రీను, వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, మోహన్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హన్మానాయక్, పెంటారెడ్డి, కిరణ్‌గౌడ్, నర్సింహ, బిచ్చానాయక్, బీక్యానాయక్, గణేశ్‌గౌడ్, అశోక్, రాఘవేందర్, పాపిరెడ్డి, నారాయణ, కృష్ణ, రాములు, లక్ష్మయ్య, మహేశ్, శ్రీకాంత్, బాబు, బుచ్చయ్య, రమేశ్, ఆలయ అనువంశిక అర్చకులు రఘురాం, వేణుగోపాల్, శ్రీధర్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్, నర్సింహ, శ్రీనివాస్, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సంత

- సొంత స్థలం కరువు
- ప్రైవేటు జాగలోనే అంగడి నిర్వహణ
- సంతలో కొరవడిన కనీస వసతులు
- ఎండకు మూగజీవాలు విలవిల
- ఇబ్బందుల్లో వ్యాపారులు, రైతులు

యాచారం, ఫిబ్రవరి 22 : మండలంలోని మాల్ మార్కెట్‌లో ప్రతి మంగళవారం పెద్దఎత్తున సంత జరుగుతుంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై మాల్ పట్టణం ఉండటం.. రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో ఉండటంతో అది అంచలంచెలుగా వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. ఐనప్పటికీ సంత నిర్వహించేందుకు అక్కడ కొన్నేండ్లుగా సొంత స్థలం లేకపోవడం గమనార్హం. నేటికీ పశువుల సంతను ప్రైవేట్ వెంచర్ స్థలంలో నిర్వహిస్తున్నారు. పశువుల సంత స్థలం ప్రైవేట్ స్థలం కావడం.. అక్కడ కనీస వసతులు లేకపోవడంతో పశువుల క్రయ, విక్రయదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఏటా పంచాయతికీ వేలం ద్వారా లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ సంతలో నేటికీ కనీస వసతులు కల్పించకపోవడంతో వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, పంచాయతీరాజ్ అధికారులు, సంత నిర్వాహకులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. పైగా అసలే ఎండా కాలం కావడంతో పశువులకు నిలువనీడ లేక, తాగడానికి సరిపడ నీళ్లు లేక మూగజీవాలతో పాటు రైతులు, వ్యాపారులు నరకం చూస్తున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు దంచికొట్టడంతో రానున్న రోజుల్లో మండుటెండల్లో సంత నిర్వహణ ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం పొందడంలో చూపించిన చొరవ సంతలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో చూపించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

తప్పని వెతలు

సంతలో ప్రతి మంగళవారం కాడెద్దులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. ఉదయం నుంచి రాత్రి వరకు పశువులు, వ్యాపారులతో సంత నిర్వహించే స్థలం కిటకిటలాడుతుంది. మూగజీవాలకు నిలువ నీడ, సరిపడా తాగునీరు లేక అవి ఎండకు అల్లాడుతుంటాయి. ఒకటి, రెండు తొట్లు నిర్మించినప్పటికీ అందులో సరిపడా నీరు లేక అవి మూగరోదన అనుభవిస్తుంటాయి. మూగజీవాలతో పాటు వ్యాపారులు, వినియోగదారులకు సైతం నీడ సౌకర్యం, తాగునీటి వసతి లేకపోవడం గమనార్హం. వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసి నీరు తాగాల్సిన దుస్థితి నెలకొన్నది. పశువులకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని.. తొట్లలో నీటిని పుష్కలంగా అందుబాటులో ఉంచాలని వ్యాపారులు కోరుతున్నారు. వ్యాపారులు, రైతులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ టెంట్లు వేసినప్పటికీ ఆశించినంత ఫలితం చేకూరడంలేదు. సంతలోనున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

రోడ్డుపైనే విక్రయాలు

మాల్‌లో అంగడిరోజు చిరువ్యాపారులు వస్తువులను సాగర్ రహదారికి ఇరువైపులా పెట్టి విక్రయిస్తుంటారు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు రోడ్డుపై నిలుపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. దీంతో ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. మర్రిగూడ రోడ్డులో వాహనాలు నిలుపడంతో మనుషులు వెళ్లలేని పరిస్థితి నెలకొంటున్నది. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఎండలో నిర్వహిస్తున్న పశువుల సంత

శాశ్వత స్థలం కేటాయించాలి

మాల్ పశువుల సంతకు శాశ్వత స్థలాన్ని కేటాయించాలి. వందల సంఖ్యలో పశువుల క్రయ, విక్రయాలు జరగడం, వందల సంఖ్యలో వ్యాపారులు రావడంతో ప్రైవేటు స్థలంలో ఇబ్బందులు తప్పడంలేదు. మాల్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంతకు కేటాయించి సమస్యను పరిష్కరించాలి. సంతలో వ్యాపారులు, మూగజీవాలకు మౌలిక వసతులను కల్పించాలి. సంతను మరింత అభివృద్ధి దిశగా నడిపించాలి.

- తలారి మల్లేశ్, టీఆర్ఎస్ నాయకుడు

సమస్యలు పరిష్కరించాలి

సంతకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలి. సంతలో కనీస వసతులు కల్పించకపోతే నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు స్థలంలో సంతను నిర్వహించడంతో వ్యాపారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం, వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. వ్యాపారులు, రైతులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలి.

- జంగమ్మ, జడ్పీటీసీ, యాచారం

ప్రభుత్వ ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్న

ఏసీబీ చర్యలు

- గొర్రెల యూనిట్ల పంపిణీలో అవకతవకలపై నలుగురి అరెస్టు
- అందులో ఇద్దరు రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ) : ఏసీబీ అధికారుల దూకుడు ప్రభుత్వ ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్నాయి. తాజాగా గొర్రెల యూనిట్ల పంపిణీలో అవకతవకలపై అవినీతి నిరోధక శాఖ అరెస్టు చేసిన వారిలో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు ఉద్యోగులు ఉండడం కలకలం రేపుతున్నది. అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసిన ఏసీబీ వాస్తవాలను నిర్ధారించి గురువారం బాధ్యులైన నల్గురు అధికారులను అరెస్టు చేసింది. అందులో రంగారెడ్డి జిల్లా భూగర్భ జల అధికారి రఘుపతిరెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేశ్‌లు ఉన్నారు. గణేశ్ ఇటీవలే నల్లగొండకు బదిలీపై వెళ్లారు. 130 గొర్రెల యూనిట్లకు సంబంధించి రూ.2.10కోట్ల పక్కదారిన మళ్లించినట్లు బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దర్యాప్తును చేపట్టారు. అప్పట్లో గొర్రెల కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించేందుకు వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులను ఇన్‌చార్జిలను నియమించింది. కాగా, రఘుపతిరెడ్డి, గణేశ్‌లు డబ్బులను ఖాతాలో జమ చేయడానికి సంబంధించిన ప్రక్రియకు ఇన్‌చార్జీలుగా వ్యవహరించారు. ప్రకాశం జిల్లాలో కొన్న గొర్రెలను రంగారెడ్డి జిల్లా మంచాలలో లబ్దిదారులకు పంపిణీ చేయగా.. గొర్రెల విక్రయదారుల ఖాతాల్లో మాత్రం డబ్బులు జమ కాలేదు.

ప్రధాన నిందితుడు మొహిద్ ఇచ్చిన ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యాయి. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కేసు దర్యాప్తును పోలీసులు అవినీతి నిరోధక శాఖకు అప్పగించారు. ఈ మేరకు బాధితుల నుంచి పూర్తి వివరాలను సేకరించిన ఏసీబీ అధికారులు సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాక బినామీ పేర్లతో అక్రమాలకు పాల్పడినట్లు తేల్చారు. ప్రధాన నిందితుడు మొయిద్‌తో కలిసి ఈ నలుగురు అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు ఏసీబీ నిర్ధారించింది. సంబంధిత సొత్తు బినామీ ఖాతాలకు మళ్లించినట్లు నిర్ధారణ అయ్యాక గురువారం బాధ్యులైన నలుగురిని అరెస్టు చేశారు.